క్లుప్తంగా

నేడు ఇరుకుపాలెంలో మంత్రి అంబటి ప్రచారం

ముప్పాళ్ళ: మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో ఈ నెల 22వ తేదీ ఉదయం 6.30గంటలకు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ద్విచక్రవాహన యాత్రతో ఎన్నికల ప్రచారం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు గురువారం తెలిపారు. సత్తెనపల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా బయలు దేరి ఇరుకుపాలెం గ్రామానికి చేరుతారన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ద్విచక్రవాహన యాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ టీమ్‌లకు శిక్షణ

పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నియోజకవర్గంలో సెక్టారల్ ఆఫీసర్లు, పోస్టల్ బ్యాలెట్ టీమ్స్, హోమ్ ఓటింగ్ టీమ్‌లకు రిటర్నింగ్ అధికారి కందుల శ్రీరాములు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవీఎంల వినియోగం, 85 సంవత్సరాలు దాటిన ఓటర్లకు హోమ్ ఓటింగ్ విధానం, ప్రతిభావంతుల ఓటు వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో శ్రీరాములు మాట్లాడుతూ ప్రతి సెక్టారల్ ఆఫీసర్లు ప్రతి పోలింగ్ బూత్‌ను మరోసారి సందర్శించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు, అమరావతి తహసీల్దార్ జె.ప్రభాకరరావు, వెంకటరమణ, ఎంపీడీఓ మల్లేశ్వరిలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



రాజుపాలెం: సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చిన నేపథ్యంలో మండలంలోని అనుపాలెం, అంచులవారిపాలెం, కోట నెమలిపురి, కొండమోడు, పెదనెమలిపురి గ్రామాలలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు ఆధ్వర్యంలో సీఐఎస్‌ఎఫ్ సిబ్బందితో గురువారం కవాతు నిర్వహించారు. సీఐ మీసాల రాంబాబు, ఎస్ఐ షమీర్ బాషా, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

పిడుగురాళ్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.విజయకుమారి



బెల్లంకొండ: చిన్నతనం నుంచి మొక్కలు పెంచడం విద్యార్థులు బాధ్యతగా భావించాలని పిడుగురాళ్ల ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.విజయకుమారి తెలిపారు. గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పాపాయపాలెం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవుల పరిరక్షణపై తల్లిదండ్రులకు విద్యార్థులు తెలియజేయాలని సూచించారు. చెట్లు నరకడం వల్ల వర్షాలు తగ్గిపోతాయని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. డీఆర్వో రమణయ్య, ఎఫ్‌బీవోలు కృష్ణమూర్తి, నరసింహారెడ్డి, రామకృష్ణ, కాశీం, సిబ్బంది జీవీఎల్ నాయుడు, సాంబయ్య పాల్గొన్నారు.

నేడు బొల్లవరంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ముప్పాళ్ళ: మండలంలోని బొల్లవరం గ్రామంలో ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం ఈ నెల 22వ తేదీన జరుగుతుందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.జయకృష్ణ తెలిపారు. ఈ శిబిరానికి ఆయా విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు హాజరవుతారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల డీపీలను తొలగించాం

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో పట్టణ పరిధిలోని వలంటీర్ల వాట్సాప్ గ్రూప్‌ల డీపీలను తొలగించామని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి గురువారం తెలిపారు. పట్టణంలో వలంటీర్లకు అధికారుల సమాచారం కోసం ఏర్పాటు చేసిన అన్ని వాట్సాప్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్‌లలో ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టుకోవద్దన్నారు. గ్రూప్‌ల్లో ఎటువంటి ప్రభుత్వ సమాచారం పెట్టరాదన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ నిబంధనల ప్రకారం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా కోదండరామ స్వామి ఆలయ ప్రతిష్ట

అమరావతి: మండల పరిధిలోని మండేపూడి గ్రామంలో గురువారం కోదండరామ స్వామి ప్రతిష్ట మహోత్సవంలో పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రతిష్టించిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నంబూరు శంకరరావుకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రాన్ని బహూకరించారు.

ఆ గ్రామాల్లో 'కోడ్' కూయలేదా..?

- యథేచ్ఛగా ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనలు
- ఉదాసీనంగా అధికారులు!



హుస్సేన్ నగరంలో ప్రధాన రహదారిలో ముసుగు వేయకుండా ఉన్న ఎన్టీఆర్ విగ్రహం



లగడపాడు ఎస్సీకాలనీ ప్రధాన రహదారిలో టీడీపీ నేత కొమ్మాలపాటి బొమ్మతో ఉన్న శిలాఫలాకం



హుస్సేన్ నగరంలో నేతల బొమ్మలకు రంగులు పూసి గుర్తులను మరిచిన అధికారులు

పల్నాడు జిల్లా పెదకూర పాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎలక్షన్ కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా అధికారులు, ఎన్నికల సిబ్బంది పట్టించుకోవడం లేదు. గ్రామ సచివాలయం పక్కనే కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా ఉదాసీనంగా ఉండిపోతున్నారు. ప్రధాన రహదారి వెంటనే ముసుగు లేకుండా విగ్రహాలు కనిపిస్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. టీడీపీకి అండగా ఉన్న గ్రామాల్లో ఎన్నికల నియమావళి అమలు కావడం లేదని ప్రజలు చెబుతున్నారు. పెదకూరపాడు మండలం లగడపాడు, కన్నెగండ్ల, హుస్సేన్ నగరం, బుచ్చియ్యపాలెం గ్రామాల్లో కోడ్ ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. – పెదకూరపాడు



గారపాడు గ్రామంలోని ఎన్టీఆర్ కళావేదికపై టీడీపీ నేతల పేర్లు, రంగులతో ఉన్న దృశ్యం



హుస్సేన్ నగరంలో ప్రధాన రహదారిపై ఉన్న టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన బల్లలు



లగడపాడు గ్రామంలో సచివాలయం పక్కనే ఉన్న పసుపు రంగులోని జెండా, బల్లలు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

బెల్లంకొండ: అన్నివర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గురువారం రాత్రి మండలంలోని మన్నె సుల్తాన్ పాలెం గ్రామానికి చెందిన 3 కుటుంబాలకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన తంగెడ అబ్బురావు, వర్ల సురేష్, తంగెడ రోశయ్య కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకరరావు చేస్తున్న కృషికి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. గ్రామ సర్పంచ్ దారం రమణారెడ్డి, మారం ప్రసాదరెడ్డి, చిట్టిబాబు, బోనం వెంకట్రామిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం నేతలు..

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఊపందుకున్నాయి. మండల పరిధిలోని పాటిబండ్ల గ్రామానికి ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రెహమాన్, హబీబ్, వారి అనుచరులు టీడీపీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోదరుడు రఘునాథ్‌రావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈసందర్భంగా షేక్ రెహమాన్, హబీబ్‌లు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పేదల పక్షాన నిలబడి సామాజిక న్యాయాన్ని చేసి చూపిస్తుందని, అందుకే వైఎస్సార్ సీపీలో చేరామని చెప్పారు. రఘునాథ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



వైఎస్సార్ సీపీలో చేరుతున్న ముస్లిం నేతలు

దళితుడిని దుర్భాషలాడిన కమిషనర్‌ను తొలగించాలి

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ

క్రోసూరు: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కోట సుబ్బును చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ దుర్భాషలాడటమేకాక అతనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తూ వెంటనే మున్సిపల్ కమిషనర్‌ను విధుల నుంచి తొలగించాలంటూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ గురువారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం పల్నాడు జిల్లా డీవీఎంసీ మెంబర్ కోట సుబ్బు మాదిగ దళితుల సమస్యలపై చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్‌కు అర్జీ ఇవ్వటానికి వెళ్లగా కమిషనర్ కోపంతో ఊగిపోతు అపాయింట్‌మెంట్ లేకుండా లోపలికి ఎవరు రానిచ్చారంటూ చులకన చేసి మాట్లాడటం జరిగిందన్నారు. తాను జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడనని కోట సుబ్బు మాదిగ తెలుపుతుండగా కమిషనర్ ఇష్టం వచ్చినట్టు రెచ్చిపోయి కోట సుబ్బు మాదిగ పై విరుచుకుపడి నోటికొచ్చినట్టు మాట్లాడడం జరిగిందన్నారు. ఈవిషయమై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు స్పందించకపోవడం విడ్డూరన్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ సాయంత్రం 8 గంటల సమయంలో కోటా సుబ్బు మాదిగ పై ఎదురు కంప్లైంట్ ఇవ్వటం జరిగిందన్నారు. దళితుల సమస్యలపై అర్జీ ఇచ్చేందుకు వెళ్లిన దళిత నేతను దుర్భాషలాడడమే కాకుండా, పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని జిల్లా డీవీఎంసీ కమిటీ పూర్తిగా ఖండిస్తుందన్నారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షుడు పట్టపు మరియ దాస్, బంకా శ్రీనివాసరావు పాల్గొన్నారు .

నేడు ఈపూరు తిరునాళ్ల



ఈపూరు : మండల కేంద్రంలోని బోటిమీద ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల శుక్రవారం జరగనుంది. ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏట కూడా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామివారికి మొక్కుబడులు తీర్చుకునేందుకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి విద్యుత్ ప్రభలు నిర్మించడం లేదు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ బందోబస్తు నిర్వహించనున్నారు.

ఉచిత విద్య కోసం అర్జీలు స్వీకరణ

శావల్యాపురం: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు మేరకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రయివేటు పాఠశాలలో ఉచిత విద్య కోసం ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సుచ రిత ఎడ్యూకేషనల్ సొసైటీ కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్‌చందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు ప్రవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు కేటాయించారని, ఆసక్తి కలిగిన వారందరు మండల కేంద్రం శావల్యాపురం శ్రీరామా పబ్లిక్ స్కూల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీవకోటి మనుగడకు చెట్లు ముఖ్యం

వినుకొండ టౌన్: జీవకోటి మనుగడకు చెట్లు ఎంతో దోహదపడతాయని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. రామచంద్రరావు పేర్కొన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని, పట్టణంలోని శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సృష్టిలోని సకల జీవ కోటి బ్రతకాలంటే గాలి అవసరమని, అటువంటి గాలినిచ్చే చెట్లను, పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందన్నారు. అంతేకాకుండా చెట్లు నాటడం వలన కలిగే మరిన్ని ప్రయోజనాలను, కళాశాల ఆవరణలో మొక్కలను నాటి విద్యార్థులకు వివరించారు. అనంతరం వెల్లటూరు రోడ్డులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నగరవనాన్ని సందర్శించి, పనులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ అధికారి సురేంద్రబాబు, ఫారెస్ట్ బీట్ అధికారి, అటవీ శాఖ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాలలో మొక్క నాటుతున్న డీఎఫ్‌ఓ రామచంద్రరావు

తూనికలు, కొలతలశాఖ అధికారుల దాడులు


చిలకలూరిపేటటౌన్: తూనికలు, కొలతల శాఖ అధికారులు గురువారం పట్టణంలోని పలు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిబంధనలు పాటించని షాపులపై 47 కేసులు నమోదు చేశారు. గుంటూరు జిల్లా తూనికలు, కొలతల శాఖ సంయుక్త అధికారిణి ఎంఎస్ఎన్ మాధురి ఆధ్వర్యంలో పట్టణంలోని చికెన్, మార్కెట్, కిరాణా, బంగారం దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలం చెల్లిన కాటాలను వినియోగించరాదని, ప్రతి ఏడాది కొలత పరికరాలను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. బియ్యం 25 కేజీలలో బ్యాగుల్లో తూనికల్లో వ్యత్యాసం కనిపిస్తుందని, వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. దాడుల్లో గుంటూరు జిల్లా తునికలు, కొలతల శాఖ ఉపసంయుక్త అధికారి షాలేమురాజు, శాఖ అధికారులు కొండారెడ్డి, అల్లూరయ్య, ఇన్స్పెక్టర్లు శివశంకర్, సునీల్‌రాజ్, జాన్ సైదా, శేషసాయి పాల్గొన్నారు.



దుకాణాల్లో తూనికలు పరిశీలిస్తున్న ఎంఎస్ఎన్ మాధురి

ఎట్టకేలకు ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల తారక రామాసాగర్‌లోని మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి మున్సిపల్ అధికారులు గురువారం ముసుగు వేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేయలేదని గురువారం 'సాక్షి'లో 'మాకు కనిపించవంతే!' శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. తారకరామా సాగర్ లో నీళ్ల ఉన్నప్పటికీ విగ్రహం వద్ద పరంజమా ఏర్పాటు చేసి రూ. 60 వేలు ఖర్చు చేసి ఎన్టీఆర్ విగ్రహం కనిపించకుండా ముసుగు వేశారు.



తారకరామా సాగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

జగనన్నకు ప్రజలే బలం



అనంతవరంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

- వైఎస్సార్ సీపీతోనే అవినీతి రహిత పాలన
- పార్టీ నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్
- క్రోసూరు మండలం ఆవులవారిపాలెం, అనంతవరం, దొడ్లేరు, 88 త్యాళ్లూరు గ్రామాల్లో ఎమ్మెల్యే శంకరావుతో కలిసి ఎన్నికల ప్రచారం

క్రోసూరు: పేదల పక్షాన నిలబడిన జగనన్నకు ప్రజలే పెద్ద బలమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. క్రోసూరు మండలంలో నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. క్రోసూరు మండలం ఆవులవారిపాలెం, అనంతవరం, దొడ్లేరు, 88 తాళ్లూరు గ్రామాల్లో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రచారంలో ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో మంచి చేశానని భావిస్తేనే, తన వల్ల మీ కుటుంబాలకు మంచి జరిగిందని భావిస్తేనే ఓటు వేయాలని సీం జగన్ చెప్పారన్నారు. అంత ధైర్యంగా ఓట్లు అడిగే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. తాను నెల్లూరులో మళ్లీ పోటీ చేస్తే మంత్రి అయ్యేవాడినని, కానీ జగనన్న మాటకు కట్టుబడి పల్నాడుకు వచ్చానన్నారు. నరసరావుపేట ఎంపీగా బీసీలకు అవకాశం ఇద్దామంటే కొందరు పార్టీ మారి వెళ్లిపోయారన్నారు. బీసీలకు రాజ్యాధికారం రావడం ఇష్టం లేని పెత్తందార్లు అందరూ ఒక్కటయ్యారన్నారు. జగనన్నకు ప్రజలే బలమన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాలనలో ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో నడిచిందన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందుతుందన్నారు. మళ్లీ ప్రజలంతా అండగా నిలబడి ఆశీర్వదిస్తే మరింత మంచి జరుగుతుందని హామీ ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ 2014లో పొత్తులు, బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మళ్లీ అదే కుట్ర మార్గంలో వస్తున్నారన్నారు. ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మళ్లీ బూటకపు హామీలతో వస్తున్నారన్నారు. అలాంటి వారికి ఓటు వేస్తే.. పెత్తందార్ల పాలనతో పేదలు ఇబ్బందులు పడతారన్నారు. పేదల పక్షాన నిలబడి మేలు చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదేళ్లలో తాను చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమం చూసి మరోసారి గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, ఎంపీపీ పి.కోటయ్య, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మండల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాలధారణతో క్రమశిక్షణ

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- భట్లూరులో క్రీస్తు మాలధారుల ప్రత్యేక ప్రార్థనలు

సత్తెనపల్లి: ప్రపంచానికి క్రీస్తు చూపిన శాంతి మార్గం నేటికీ అనుసరణీయమేనని, ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవులు ధరించే మాలధారణ వ్యక్తిగతమైన క్రమశిక్షణను నేర్పుతుందని, క్రీస్తు మార్గాన్ని చేరువ చేస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామంలో మాలధారుల ప్రత్యేక ప్రార్థనా కూటమిలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా సంఘ కాపరి హృదయరాజ్, రాజశేఖర్‌లు అంబటి రాంబాబుకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు భట్లూరు కోటేశ్వరరావు, స్థానిక పెద్దలు మందా అబ్బురామ్, దాసరి విజయ్, భట్లూరు బాబూరావు, దాసరి కిరణ్, సంఘస్తులు, గ్రామ, మండల నాయకులు ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పార్థన చేస్తున్న సంఘ కాపరి, పక్కన మంత్రి అంబటి రాంబాబు

వైఎస్సార్ సీపీలో చేరిన 'వెల్లల చెరువు'

కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు: పెదకూరపాడుకు చెందిన సీనియర్ టీడీపీ నేత వెల్లల చెరువు కోటేశ్వరరావు గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కోటేశ్వరరావుకు పార్టీ కండువా కప్పి శంకరరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కుల, మత, వర్గ బేధాలు లేకుండ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని, మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించి వారికి అండగా ఉంటామన్నారు. ఏప్పుడు అవసరమైనా వారికి అందుబాటులో ఉంటామన్నారు. వారి వెంట ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్‌లు ఉన్నారు.



వెల్లల చెరువు కోటేశ్వరరావుకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

అభ్యుదయాన్ని ప్రకటించేదే కవిత

నరసరావుపేట ఈస్ట్: మానవజాతి ఆశయాలను, అభ్యుదయాన్ని ప్రకటించేదే కవిత అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ఈదర శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక పల్నాడు కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ కవిత దినోత్సవంలో ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాచీన కాలం నుంచి ఆధునిక యుగం వరకు కవిత ఆవిర్భావం, లక్షణాలు, శైలి తదితర అంశాలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రంగస్థలి కార్యదర్శి షేక్ బాజీ, రచయిత గంధం యాజ్ఞవల్క్యశర్మ, పద్యకవి ఈవూరి వెంకటరెడ్డి, అచ్చుల సుబ్బారావు, చంద్రకళ పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ ఆధ్వర్యంలో ప్రపంచ కవిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి యువ కవులను సత్కరించారు. ఈసందర్భంగా రాకేష్ మాట్లాడుతూ, తెలుగు భాష సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు.